RNI NO.TELTEL/2022/83842

PRABHATA GAMANAM

# ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

ప్రభాత గమనం

తెలుగు దినపత్రిక

జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?

విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...

ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.

ఫోన్ : 7780470374

వరంగల్ | సంచిక 241 | సంపుటి 4 | శుక్రవారం | 22-05-2026 | పేజీలు 4 | వెల 3/-

# వావ్.. మిస్ట్ బస్టాప్!

- హనుమకొండలో రాష్ట్రంలోనే తొలిసారిగా వినూత్న ఏర్పాటు
- ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పబ్లిక్ గార్డెన్
- ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి,
- సన్నటి నీటి తుంపరలతో బస్టాప్ లో శీతల వాతావరణం
- వడగాలులు, ఎండ వేడిమి నుంచి ఉపశమనం
- ప్రజల ఆరోగ్యం, ప్రయాణ సౌకర్యం దృష్ట్యా జీడబ్ల్యూఎంసీ చర్యలు



2

ప్రజలకు మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కల్పించే లక్ష్యంతో హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన మిస్ట్ బస్టాప్‌లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా కలెక్టర్ గురువారం ప్రారంభించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్రంలోనే తొలిసారిగా హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రధాన గేట్ పక్కన, పెట్రోల్ పంప్ పబ్లిక్ గార్డెన్ సమీపంలో ఈ మిస్ట్ బస్టాప్‌లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే, కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం ప్రజలతో కలిసి బస్టాప్‌లలో కూర్చొని పరిశీలించారు.మిస్ట్ బస్టాప్‌లను వేసవి కాలంలో ప్రజలకు చల్లదనాన్ని అందించే విధంగా ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. బస్టాప్ పైకప్పు భాగంలో అమర్చిన ప్రత్యేక పైపుల ద్వారా సన్నటి నీటి తుంపరలు చల్లబడుతూ లోపల శీతల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. —హనుమకొండ, ప్రభాత గమనం

# జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

- తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి
- సెన్సస్–2027 ఫేజ్-1ను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష
- హౌస్ లిస్టింగ్ బ్లాక్ ల వారీగా ఎన్యూమరేషన్ వేగవంతం
- ఎన్యూమరేటర్లు తప్పులు లేకుండా సమాచారం సేకరించాలని సూచన
- జనగణన ప్రక్రియపై అధికారులకు పవర్ పాయింట్
- జీడబ్ల్యూఎంసీ పరిధిలో పురోగతిపై వివరాలు అడిగిన డైరెక్టర్



04

2027 జనగణన ఫేజ్-1 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలంగాణ జనగణన డైరెక్టర్ సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సెన్సస్–2027 ఫేజ్–1 కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మున్సిపల్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న సెన్సస్–2027 ఫేజ్–1 కార్యక్రమాల అమలు, ప్రగతి, ఫీల్డ్ స్థాయిలో చేపడుతున్న చర్యలపై జనగణన డైరెక్టర్ సమీక్షించారు. జనగణన కార్యక్రమాలను వేగవంతంగా, ఖచ్చితంగా పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర జనగణన డైరెక్టర్ జిల్లాలో, జీడబ్ల్యూఎంసీ పరిధిలో జరుగుతున్న జనగణన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# ‘యూపీఎస్సీ’ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షలకు హన్మకొండలో 10 కేంద్రాలు ఏర్పాటు
- 4,075 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు కలెక్టర్ చాహత్
- ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశం
- పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే గేట్లు మూసివేత
- ఆలస్యంగా వచ్చే అభ్యర్థులకు ప్రవేశం లేదని స్పష్టం




04

ఈ నెల 24న నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్, న్యూఢిల్లీకి చెందిన ప్రైవేట్ సెక్రటరీతో కలిసి అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 4,075 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



2

# కర్రె గుట్టలను సందర్శించిన ఎస్పీ

- ముళుమూరు నుంచి తాడపాల వరకు నిర్మిస్తున్న రోడ్డు పనుల పరిశీలన

ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం పోలీస్ అధికారులతో కలిసి వెంకటాపురం మండల పరిధిలోని కర్రె గుట్టలను సందర్శించారు. ఈ సందర్భంగా ముళుమూరు నుండి పాముమూరు, జల్ల, డోలీ మీదుగా తాడపాల వరకు నిర్మాణంలో ఉన్న రహదారి పనులను పరిశీలించారు.

# ఎంజేపీ బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

- రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలి :మంత్రి పొన్నం ప్రభాకర్
- 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్ శిక్షణకు ఆదేశం
- 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలకు అభినందనలు
- విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు నేర్పాలని సూచన
- ప్రతి గురుకులంలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తాం
- విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందించేలా ఉపాధ్యాయులు పని చేయాలని సూచన



04

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచేలా అధ్యాపక బృందం సమిష్టిగా కృషి చేయాలని మంత్రి సూచించారు. గురువారం నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్ ను మంత్రి అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన విద్యాసంస్థలు ఆత్మపరిశీలన చేసుకుని వచ్చే విద్యాసంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని హెచ్చరించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ తదితర అంశాల్లోనూ ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్, ఇతర కాంపిటీటివ్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# టూరిస్ట్ గైడ్స్-2026 దరఖాస్తుల ఆహ్వానం

- 33 జిల్లాల గ్రాడ్యుయేట్లకు అవకాశం
- చరిత్ర, వారసత్వం, పర్యాటక రంగాలపై ఆసక్తి ఉన్న వారికి ప్రాధాన్యం
- ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ అందించనున్న శాఖ
- తెలంగాణ పర్యాటక ప్రదేశాలపై అవగాహన కల్పించేలా శిక్షణ
- మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి
- అవసరమైన పత్రాలను అప్లోడ్ చేయాలని సూచన
- పూర్తి వివరాలు అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులోకి

2

తెలంగాణ ప్రభుత్వం వారసత్వ శాఖ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన గ్రాడ్యుయేట్ల నుంచి టూరిస్ట్ గైడ్స్-2026 ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పురావస్తు, చరిత్ర, వారసత్వం, సంస్కృతి, కళలు, నిర్మాణ శైలి, పర్యాటక రంగాలపై ఆసక్తి కలిగి మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్ కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

# వావ్.. మిస్ట్ బస్టాప్!

- హనుమకొండలో రాష్ట్రంలోనే తొలిసారిగా వినూత్న ఏర్పాటు
- ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి, పబ్లిక్ గార్డెన్ వద్ద ప్రారంభం
- ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్
- సన్నటి నీటి తుంపరలతో బస్టాప్ లో శీతల వాతావరణం
- వడగాలులు, ఎండ వేడిమి నుంచి ఉపశమనం
- ప్రజల ఆరోగ్యం, ప్రయాణ సౌకర్యం దృష్ట్యా జీడబ్ల్యూఎంసీ చర్యలు
- కొత్త బస్టాప్ లపై ఆనందం వ్యక్తం చేసిన నగరవాసులు



**హనుమకొండ, ప్రభాత గమనం :**

ప్రజలకు మండుతున్న ఎండల నుంచి ఉపశమనం కల్పించే లక్ష్యంతో హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన మిస్ట్ బస్టాప్‌లను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ జిల్లా కలెక్టర్ గురువారం ప్రారంభించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రాష్ట్రంలోనే తొలిసారిగా హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రధాన గేట్ పక్కన, పెట్రోల్ పంప్ పబ్లిక్ గార్డెన్ సమీపంలో ఈ మిస్ట్ బస్టాప్‌లను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే, కలెక్టర్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం ప్రజలతో కలిసి బస్టాప్‌లలో కూర్చొని పరిశీలించారు.మిస్ట్ బస్టాప్‌లను వేసవి కాలంలో ప్రజలకు చల్లదనాన్ని అందించే విధంగా ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. బస్టాప్ పైకప్పు భాగంలో అమర్చిన ప్రత్యేక పైపుల ద్వారా సన్నటి నీటి తుంపరలు చల్లబడుతూ లోపల శీతల వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. దీంతో వడగాలులు, ఎండ వేడిమి నుంచి ప్రయాణికులకు ఉపశమనం లభిస్తోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరానికి వివిధ అవసరాల కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని, బస్సుల కోసం వేచి ఉండే సమయంలో వారికి ఇబ్బందులు తలెత్తకుండా ఈ మిస్ట్ బస్టాప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత, ప్రయాణ సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ జీడబ్ల్యూఎంసీ నిధులతో రెండు మిస్ట్ బస్టాప్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు ఇలాంటి వినూత్న చర్యలు కొనసాగిస్తామని చెప్పారు. మిస్ట్ బస్టాప్‌లను చూసిన యువకులు, మహిళలు ఆనందం వ్యక్తం చేశారు. మండుతున్న ఎండల్లో ఇలాంటి చల్లని బస్టాప్‌లు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఎండీ అజీజ్ ఖాన్, జీడబ్ల్యూఎంసీ ఈఈ రవికుమార్, హార్టికల్చర్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# గోడౌన్లను సందర్శించిన ములుగు ఎస్పీ రాంనాథ్ కేకన్

- జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లు, రవాణాపై ఆరా
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరితగతిన గిడ్డంగులకు తరలించాలని ఆదేశం

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకాన్ వాజేడు మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ధాన్యాగార నిల్వల కేంద్రాన్ని అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మార్కెట్ కమిటీ అధికారులతో మాట్లాడుతూ ములుగు జిల్లాలో మొక్కజొన్న పండించిన రైతుల వద్ద నుండి త్వరితగతిన కొనుగోలు పూర్తి చేయాలని, అదేవిధంగా కొనుగోలు చేసిన మొక్కజొన్న లను మార్కెట్ గిడ్డంగులకు వెనువెంటనే తరలించాలని సూచించారు. తద్వారా అటు రైతులకు గాని ఇటు వ్యాపారస్తులకు గాని నష్టం ఉండదని సూచించారు. మొక్కజొన్న ల రవాణాకు వాహనాల కొరత ఉంటే వెంటనే స్థానిక అధికారుల సహాయం తీసుకోవాలని సూచిస్తూ, తగిన మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులను ఆదేశించారు. ఈ సందర్శనలో ఏటూరు నాగారం ఏ ఎస్ పి మనన్ భట్ డిఎస్పీ రవీందర్, ఎస్బి ఇన్ స్పెక్టర్ శంకర్, ఏటూరు నాగారం సిఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# కర్రె గుట్టలను సందర్శించిన ఎస్పీ

- మురుమూరు నుంచి తాడపాల వరకు నిర్మిస్తున్న రోడ్డు పనుల పరిశీలన
- పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ములుగు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ గురువారం పోలీస్ అధికారులతో కలిసి వెంకటాపురం మండల పరిధిలోని కర్రె గుట్టలను సందర్శించారు. ఈ సందర్భంగా మురుమూరు నుండి పామునూరు, జల్ల, డోలీ మీదుగా తాడపాల వరకు నిర్మాణంలో ఉన్న రహదారి పనులను పరిశీలించారు. రహదారి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రహదారి నిర్మాణ పనులల్లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందితో ఎస్పీ మాట్లాడి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ మనన్ భట్, ములుగు డీఎస్పీ రవీందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ శంకర్, వెంకటాపురం సీఐ రమేష్, వెంకటాపురం ఎస్ఐ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.




# చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- నాన్ బెయిలబుల్ వారెంట్ అమలు చేసిన హసన్ పర్తి పోలీసులు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసులో ప్రధాన నిందితుడిపై జారీ అయిన నాన్ బెయిలబుల్ వారెంట్ ను పోలీసులు అమలు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, క్రైం నం.240/23, తేదీ 30-07-2023, సెక్షన్లు 454, 380 ఐపీసీ కింద నమోదైన కేసులో ప్రధాన నిందితుడైన బొండా రాంరెడ్డి (38), అనంతసాగర్ గ్రామం, హసన్‌పర్తి మండలానికి చెందిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేశారు. 2023 జూలై 29న అనంతసాగర్ గ్రామంలో జరిగిన చోరీ ఘటనలో నిందితుడు ఫిర్యాదుదారుడి ఇంటి నుంచి 1.75 తులాల నెక్లెస్, 11 గ్రాముల బంగారు బిస్కెట్, 25 తులాల బంగారం సహా మొత్తం రూ.1,85,000 విలువైన ఆభరణాలను దొంగిలించినట్లు కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడిని 31-07-2023న అరెస్ట్ చేసి పరకాల జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. అయితే అనంతరం కోర్టు విచారణలకు నిందితుడు నిరంతరం గైర్హాజరు కావడంతో గౌరవ న్యాయస్థానం నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ ఆధ్వర్యంలో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని పరకాల ఉపజైలుకు తరలించారు.




# ప్రజల్లో న్యాయంపై భరోసా కల్పించాలి

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరుగుతుందనే భరోసా కల్పించాలని పోలీస అధికారులకు సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. టాస్క్‌ఫోర్స్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన బండారి రాజు, మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కె. స్వామి గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రజల ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి పోలీస్ శాఖపై విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని తెలిపారు.




## టూరిస్ట్ గైడ్స్-2026
# దరఖాస్తుల ఆహ్వానం

- 33 జిల్లాల గ్రాడ్యుయేట్లకు అవకాశం
- చరిత్ర, వారసత్వం, పర్యాటక రంగాలపై ఆసక్తి ఉన్న వారికి ప్రాధాన్యం
- ఎంపికైన వారికి ప్రత్యేక శిక్షణ అందించనున్న శాఖ
- తెలంగాణ పర్యాటక ప్రదేశాలపై అవగాహన కల్పించేలా శిక్షణ
- మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి
- అవసరమైన పత్రాలను అప్లోడ్ చేయాలని సూచన
- పూర్తి వివరాలు అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులోకి

**హైదరాబాద్, ప్రభాత గమనం :**

తెల ంగాణ ప్రభుత్వం వారసత్వ శాఖ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన గ్రాడ్యుయేట్ల నుంచి టూరిస్ట్ గైడ్స్-2026 ప్రోగ్రామ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పురావస్తు, చరిత్ర, వారసత్వం, సంస్కృతి, కళలు, నిర్మాణ శైలి, పర్యాటక రంగాలపై ఆసక్తి కలిగి మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు ఉన్న అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. టూరిస్ట్ గైడ్స్ గా ఎంపికైన వారికి పర్యాటక రంగానికి సంబంధించిన ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర చారిత్రక, పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను సందర్శకులకు వివరించే విధంగా అభ్యర్థులను తీర్చిదిద్దనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తు ఫారమ్‌ను జాగ్రత్తగా పూరించి అవసరమైన పత్రాలను అప్లోడ్ చేయాలని సూచించారు. దరఖాస్తుల సమర్పణ, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలను సంబంధిత శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.





# దేశ సాంకేతిక ప్రదాత రాజీవ్ గాంధీ

- గార్ల కాంగ్రెస్ అధ్యక్షుడు ధనియాకుల రామారావు
- దేశ సాంకేతిక విప్లవానికి నాంది పలికిన నాయకుడు రాజీవ్ గాంధీ
- తిర్లాపురంలో ఘనంగా నిర్వహించిన మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు
- రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు
- ఐటీ, టెలికాం రంగ అభివృద్ధికి రాజీవ్ సేవలు చిరస్మరణీయం
- దేశ ఐక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత అంటూ కొనియాడిన నాయకులు
- యువతకు దిశానిర్దేశం చేసిన దూరదృష్టి నాయకుడని ప్రశంసలు
- కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు
- ప్రజలకు పండ్ల పంపిణీ చేసి రాజీవ్ సేవలను స్మరించిన కార్యకర్తలు

**గార్ల, మే 21(ప్రభాత గమనం) :**

భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రపంచ దేశాల సరసన నిలబెట్టిన ఘనత లీడర్, దివంగత ప్రధాని రాజీవ్ గాంధీకే దక్కుతుందని గార్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధనియాకుల రామారావు కొనియాడారు. గురువారం గార్ల-డోర్నకల్ రహదారి పక్కన ఉన్న తిర్లాపురంలో రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. ధనియాకుల రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, నాయకులు రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు మాట్లాడుతూ.. దేశంలో నేడు మనం చూస్తున్న ఐటీ, సాంకేతిక విప్లవానికి రాజీవ్ గాంధీ నాంది పలికారని గుర్తుచేశారు. దేశంలోని పేదరికాన్ని నిర్మూలించి, సమసమాజ స్థాపన కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం తన ప్రాణాలను సైతం పణంగా పెట్టిన త్యాగధనుడని కొనియాడారు. దేశం కోసం తల్లిని (ఇందిరా గాంధీ) నీ కోల్పోయిన కుటుంబం వారిదని, అలాగే తెలంగాణ ప్రజల ఆకాంక్షను గుర్తించి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి మండా రాము గౌడ్ మాట్లాడుతూ.. రాజీవ్ గాంధీ ఎంతో నిష్కల్మషమైన నాయకుడని, యువతకు సరైన దశా-దిశ చూపిన మార్గదర్శి అని కొనియాడారు. ఆయన తీసుకువచ్చిన టెలికాం విప్లవం వల్లే దేశంలోకి మొబైల్ సాంకేతికత వేగంగా విస్తరించిందని, రాజీవ్ గాంధీ దూరదృష్టి లేకపోతే 2005 వరకు కూడా దేశంలోకి సెల్ ఫోన్లు వచ్చేవి కావని స్పష్టం చేశారు. రైల్వే ఎంప్లాయీస్ మెంబర్, రాజీవ్ గాంధీ విగ్రహ వ్యవస్థాపకులు జరుపుల లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ.. భారత దేశ చరిత్రలో రాజీవ్ గాంధీ పేరు శాశ్వతంగా నిలిచిపోతుందన్నారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలకు, ప్రజలకు పండ్లను పంపిణీ చేశారు.ఈ నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ జిల్లా నాయకులు గుండా వెంకట్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బాపనపల్లి సుందర్, ముఖ్య నాయకులు మాలోత్ వెంకట్ లాల్, జవ్వాజి శ్రీను, మండల నాయకులు గూగులోత్ శ్రీను, గులగట్టు బాబు, బాసిపంగు మధు, పృథ్వీ, బాదావత్ ప్రసాద్ పాల్గొన్నారు. మహిళా నాయకులు అనుముల గంగ, వశ్యతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**నివాళులర్పించిన సర్పంచ్ బానోత్ పార్వతి**

భారతదేశపు మాజీ ప్రధాని, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని గార్ల పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు ఆయనకు ఘనంగా నివాళులర్పించాయి. సీతంపేట రోడ్‌లో ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి గార్ల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ పార్వతీహతు రామ్ నాయక్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ పార్వతి మాట్లాడుతూ.. భారతదేశాన్ని ఆధునికత వైపు నడిపించిన దార్శనిక నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. సాంకేతిక రంగంలో, టెలికమ్యూనికేషన్స్ విభాగంలో ఆయన తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు దేశ ప్రగతికి బాటలు వేశాయన్నారు. యువత సాధికారత కోసం, దేశ భవిష్యత్తు కోసం రాజీవ్ గాంధీ చేసిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని ఆమె గుర్తుచేశారు.రాజీవ్ గాంధీకి నివాళులర్పించిన వారిలో ఉపసర్పంచ్ మహమ్మద్ జెరీనా బేగం, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకురాలు శంషాద్ బేగం, మర్రిగూడెం సర్పంచ్ భూక్య రామ్ సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తాళ్లపల్లి కృష్ణ గౌడ్, దీకొండ రాము తదితరులు ఉన్నారు. వీరితో పాటు పార్టీ ప్రముఖులు కత్తుల ప్రశాంత్, షేక్ యాకూబ్ పాషా, ఎండి మోహిన్, కోల కుమార్ గౌడ్, తోడేటి శ్రీను, వేముల పిచ్చయ్య, భూక్య రామ్ కుమార్, గోపాలపురం ఉపసర్పంచ్ ఎర్రగడ్డ శ్రీనివాస్, మా రెడ్డి రమేష్, బోడ శ్రీకాంత్, మొహమ్మద్ రహీం, భూక్య భద్రాద్రి, కాముని రెడ్డి, మండల రవి గౌడ్ సహా పలువురు కాంగ్రెస్ శ్రేణులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

# పల్లెల్లో కంపు.. కంపు!

## పారిశుధ్య లోపంతో మురికికూపంగా మారిన గార్ల

- పూడికతో నిండిన కాలువలు.. రోడ్లపైకి మురుగునీరు
- దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- డెంగ్యూ, మలేరియా భయంతో ఆందోళనలో గ్రామస్థులు
- ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు, సర్పంచ్
- ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని ప్రజల డిమాండ్
- బ్లీచింగ్, ఫాగింగ్ నిర్వహించి ఆరోగ్య రక్షణ కల్పించాలని విజ్ఞప్తి
- సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలకు హెచ్చరిక

గార్ల ,మే 21 (ప్రభాత గమనం):

ఆదర్శ గ్రామ పంచాయతీగా నిలవాల్సిన గార్ల మేజర్ గ్రామపంచాయతీ.. ప్రస్తుతం పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతోంది. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా గ్రామం మురికికూపంగా మారుతోందని స్థానికులు మండిపడుతున్నారు. ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికతీయని మురికికాలువలతో మండల కేంద్రం నరకప్రాయంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలోని ప్రధాన వీధులు, అంతర్గత కాలనీల పరిస్థితి దయనీయంగా మారింది. మురికికాలువలు ఎక్కడికక్కడే వ్యర్థాలతో నిండిపోయి, ప్రవాహం నిలిచిపోయింది. దీంతో కాలనీల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి, ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. "కొద్దిపాటి వర్షం పడితే చాలు.. మురుగునీరంతా రోడ్లపైకి చేరుతోంది. కాలనీల్లో నడవడమే నరకంగా మారింది. ఇంట్లోకి మురుగునీరు వచ్చే పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాథుడే లేడు."గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులను గాలికొదిలేశారని, స్థానిక సర్పంచ్ సైతం ఈ సమస్యలపై కనీసం స్పందించడం లేదని ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. సమస్యల గురించి పలుమార్లు పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగినా, అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని, వారి ఫిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గార్ల మేజర్ పంచాయతీలో ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తు వీడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టి, మురికికాలువల్లో పూడికను తొలగించాలని కోరుతున్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి, దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని.. ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని గ్రామస్థులు పట్టుబడుతున్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరిస్తున్నారు.





## నిబద్ధతతో విధులు నిర్వహించాలి

- మహబూబాబాద్ ఎస్పీ డా. శబరీష్
- ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది సేవలు ప్రశంసనీయం
- పోలీసు శాఖపై ప్రజల విశ్వాసం పెంచాలి
- అవినీతికి శాఖలో ఎలాంటి స్థానం లేదు
- క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచన
- ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి
- సిబ్బంది సంక్షేమానికి జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉంది
- విధుల్లో నిర్లక్ష్యానికి తావులేదన్న ఎస్పీ
- జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ దర్బార్



ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బందితో పోలీస్ దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, వీఐపీ బందోబస్తు విధులు, ఎన్నికల డ్యూటీలు, ప్రజా భద్రత చర్యలు, ప్రత్యేక ఆపరేషన్లు, పండుగల సమయంలో నిర్వహించే బందోబస్తు వంటి బాధ్యతలను ఏఆర్ సిబ్బంది సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. ఇదే క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు కొనసాగించాలని సూచించారు. పోలీసు శాఖపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మరింత పెంచేలా ప్రతి పోలీసు సిబ్బంది నిజాయితీతో పనిచేయాలని, శాఖలో అవినీతికి ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా రాజీకి తావులేదని హెచ్చరించారు. రాష్ట్ర డీజీపీ మార్గదర్శకాల మేరకు క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలన్నారు. సిబ్బంది సంక్షేమం పట్ల జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, వసతి, డ్యూటీ సమయాలకు సంబంధించిన అంశాలను అధికారులకు నేరుగా తెలియజేయాలని సూచించారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని సూచించారు. వేసవి కాలంలో విధులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తూ తగినంత నీరు తీసుకోవాలని తెలిపారు. విధుల్లో ఒత్తిడిని అధిగమించేందుకు మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని, కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొంటూ, శాఖ ప్రతిష్టను పెంచే విధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ సూచించారు.

## ట్రై సిటీ ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చర్యలు

- వాహన పార్కింగ్ స్థలాలను పరిశీలించిన వరంగల్ సీపీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో

ట్రై సిటీ పరిధిలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను అధిగమించే దిశగా హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై వాహన పార్కింగ్ కోసం అవసరమైన స్థలాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ సంబంధిత అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అధికారులతో కలిసి హనుమకొండలోని అశోక జంక్షన్, హనుమకొండ చౌరస్తా, ఏనుగుల గడ్డ ప్రాంతాలను, అలాగే వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్, హెడ్ పోస్టాఫీస్ ప్రాంతాలను సీపీ సందర్శించారు. ఈ ప్రాంతాల్లో వాహన పార్కింగ్ ఏర్పాటుకు అవసరమైన స్థల విస్తీర్ణం, సాధ్యాసాధ్యాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ట్రై సిటీ పరిధిలో ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణాల్లో ఒకటి రోడ్లపై అనధికారిక పార్కింగ్ అని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యాపార సముదాయాలు, షాపింగ్ మాల్స్ ముందు వాహనాలను నిలిపివేయకుండా, భవనాల సెల్లార్లలోనే పార్కింగ్ చేసే విధంగా వ్యాపారస్తులకు ట్రాఫిక్ అధికారులు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఇలా చేయడం ద్వారా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ తగ్గి, కొంతవరకు పార్కింగ్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని సీపీ అభిప్రాయపడ్డారు. నగర ప్రజలకు సౌకర్యవంతమైన ట్రాఫిక్ వ్యవస్థను అందించేందుకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ పరిశీలనలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రైనీ ఐపీఎస్ మనీషా నేహ్రా, ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు వెంకన్న, సుజాత, హనుమకొండ, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐలు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం




- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య ధ్వజం
- త్వరలోనే క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై ఇంటింటి సర్వే
- మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ జీవోను ఉపసంహరించుకోవాలి
- గార్ల మండల కమిటీ సమావేశంలో ముఖ్య నేతల డిమాండ్

గార్ల,మే 20 (ప్రభాత గమనం):

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ఆకర్షణీయమైన హామీలను నెరవేర్చడంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక మంగపతి రావు భవనంలో గడ్డిపాటి రాజారావు అధ్యక్షతన బుధవారం సిపిఎం గార్ల మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జి. నాగయ్య మాట్లాడారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ, ప్రజలకు ఇచ్చిన ప్రధాన వాగ్దానాలను తుంగలో తొక్కారని ఆయన విమర్శించారు. కొత్త పెన్షన్ల మంజూరు ఊసే లేదని, పెన్షన్ల పెంపుదలపై స్పష్టత కరువైందని మండిపడ్డారు.సమావేశంలో జి. నాగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు విమర్శలు గుప్పించారు:భూమిలేని వ్యవసాయ కార్మికులకు, ఆటో కార్మికులకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున ఇస్తామన్న ఆర్థిక సహాయం ఊసే లేదన్నారు.జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేసి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నెరవేర్చలేదు.మహిళలకు నెలకు రూ. 2,500 ఇచ్చే మహాలక్ష్మి పథకం, రైతులకు రూ. 15 వేలు, కౌలు రైతులకు రూ. 12 వేలు అందించే రైతు భరోసా పథకాలను అమలు చేయకుండా ప్రజలను వంచిస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలోనూ మొదటి విడత మాత్రమే నిధులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు."ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం ఆధ్వర్యంలో త్వరలోనే క్షేత్ర స్థాయిలో ఇంటింటి సర్వే నిర్వహిస్తాం. ప్రజలను ఏకం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు చేపడతాం."మండల పరిధిలోని రైతాంగానికి ఎలాంటి ప్రయోజనం లేని మున్నేరు – పాలేరు లింక్ కెనాల్ నిర్మాణ సర్వే జీవోను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని నాగయ్య డిమాండ్ చేశారు. దానికి బదులుగా మండలంలో మున్నేరు ప్రాజెక్టును నిర్మించి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలన్నారు. అలాగే రాంపురం, మద్దివంచ గ్రామపంచాయతీ ప్రజల దశాబ్దాల సమస్య అయిన పాకాల చెక్ డ్యాం వద్ద 'హై లెవల్ బ్రిడ్జి' నిర్మాణానికి నిధులు మంజూరు చేసి, యుద్ధప్రతిపాదికన పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలవాల సత్యవతి పాల్గొని మాట్లాడారు. వారితో పాటు పార్టీ సభ్యులు వి. వెంకటేశ్వర్లు, ఏ. వీరాస్వామి, ఐ. గోవింద్, యం. నాగమణి, కె. ఈశ్వర్ లింగం, సిహెచ్. ఎల్లయ్య, టీ. రమా, కై బాబు, సిహెచ్. బాబు, ఎస్ కె. మౌలానా, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## కంపెనీ డబ్బులు కాజేసి షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు

- రూ.7.90 కోట్ల మోసం వెలుగులోకి
- వెండర్ల చెల్లింపులను తన ఖాతాలోకి మళ్లించిన అకౌంట్స్ ఉద్యోగి
- ఆరు నెలలుగా కొనసాగిన భారీ ఆర్థిక అక్రమాలు
- కంపెనీ లెక్కల పరిశీలనలో బయటపడిన మోసం
- రూ.1.47 కోట్లు ఫ్రీజ్ చేసిన పోలీసులు
- షేర్ మార్కెట్ లో పెట్టుబడులు పెట్టి నష్టపోయిన నిందితుడు
- నగదు, రెండు స్మార్ట్ ఫోన్లు స్వాధీనం
- గతంలోనూ ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు వెల్లడి
- నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలింపు

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని కొత్తూరు మండలంలోని ఆర్.ఎం. కన్వర్టర్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో భారీ ఆర్థిక మోసం వెలుగుచూసింది. కంపెనీ అకౌంట్స్ విభాగంలో పనిచేస్తున్న హనుమాన్ల లక్ష్మణ్ అనే ఉద్యోగి రూ.7 కోట్ల 90 లక్షల 27 వేల 915 రూపాయలను అక్రమంగా తన ఖాతాలోకి మళ్లించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ విషయాన్ని శిరీష గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గత ఆరు నెలలుగా పరిశ్రమకు చెందిన వెండర్లకు పంపించాల్సిన చెల్లింపులను హనుమాన్ల లక్ష్మణ్ తెలివిగా తన వ్యక్తిగత ఖాతాలోకి మళ్లిస్తున్నాడు. వెండర్ల పేర్లతోనే రికార్డులు నమోదు చేస్తూ డబ్బులను అక్రమంగా తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఇటీవల కంపెనీ డైరెక్టర్లు లెక్కలను పరిశీలించగా అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీంతో లోతుగా తనిఖీ చేయగా భారీ మోసం జరిగిన విషయం బయటపడింది. వెంటనే కంపెనీ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టిన కొత్తూరు సీఐ నర్సయ్య మోసాన్ని వెలికితీశారు. నిందితుడి ఖాతా నుంచి రూ.1 కోటి 47 లక్షలను పోలీసులు ఫ్రీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. అదనంగా రూ.2.60 లక్షల నగదు, రెండు స్మార్ట్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన డబ్బును షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టి నష్టపోయినట్లు నిందితుడు విచారణలో ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా గతంలో జూబ్లీహిల్స్, చందానగర్ ప్రాంతాల్లో పనిచేసిన సమయంలో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని డీసీపీ శిరీష వెల్లడించారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కొత్తూరు సీఐ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.




## ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లు ప్రారంభం

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

మహబూబాబాద్ పట్టణంలోని నెహ్రూ సెంటర్ మరియు మదర్ థెరిస్సా సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన నూతన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్లను జిల్లా ఎస్పీ డా. శబరీష్, ప్రారంభించారు. పట్టణంలో పెరుగుతున్న వాహన రద్దీ, రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఈ సిగ్నల్ వ్యవస్థను అమలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను పాటించాలని సూచించారు. రెడ్ సిగ్నల్ వద్ద వాహనాలను ఆపడం, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ వినియోగించడం, ట్రాఫిక్ నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించడంతో పాటు సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని జిల్లా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ తిరుపతి రావు, టౌన్ సీఐ రఘుపతి రెడ్డి, ట్రాఫిక్ ఎస్.ఐ అరుణ్ కుమార్ ట్రాఫిక్ పోలీసులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## పంటపొలాల్లో చెలరేగిన మంటలు

- వరి గడ్డి, మొక్కజొన్న అవశేషాలకు నిప్పంటించడంతో వేగంగా వ్యాపించిన మంటలు
- వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ఇన్‌స్పెక్టర్ కాంతికుమార్
- అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపులోకి తెచ్చిన పోలీసులు
- 15 ఎకరాల్లో గడ్డి, చెట్లు, పైపులు దగ్ధం
- సమయస్ఫూర్తితో భారీ ప్రమాదాన్ని తప్పించిన ఇన్‌స్పెక్టర్
- పంట అవశేషాలను కాల్చవద్దని రైతులకు సూచన

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

పరకాల పట్టణంలోని ఇండియన్ గ్యాస్ గోదాం వెనుక ఉన్న పంట పొలాల్లో గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగి స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు వరి గడ్డి, ముక్కజొన్న పంట అవశేషాలకు నిప్పంటించడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ కాంతికుమార్ వెంటనే తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బందితో కలిసి మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో మంటలు వ్యాపించడంతో ఎండిన గడ్డి, చెట్లు, పైపులు, బట్ట పైపులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మంటలు సమీపంలోని మామిడి తోటల వరకు వ్యాపించే ప్రమాదం నెలకొనగా, ఇన్‌స్పెక్టర్ కాంతికుమార్ సమయస్ఫూర్తితో వ్యవహరించి భారీ ప్రమాదాన్ని నివారించారు. ఈ ఘటనతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అనంతరం మంటలు అదుపులోకి రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పంట అవశేషాలను కాల్చకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## ముగ్గురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ముగ్గురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో భాగంగా వరంగల్ కమిషనరేట్‌కు కొత్తగా నియమితులైన కె. కుమార్ స్వామిని మీల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు నియమించారు. వీఆర్‌లో ఉన్న బండారి రాజును టాస్క్‌ఫోర్స్ విభాగానికి బదిలీ చేయగా, హరికృష్ణను సీసీఎస్ విభాగానికి బదిలీ చేసినట్లు అధికారికంగా వెల్లడించారు. పోలీస్ శాఖలో పరిపాలనా అవసరాల దృష్ట్యా ఈ బదిలీలు చేపట్టినట్లు సమాచారం.

# ఎంజేపీ బ్రాండింగ్ క్రియేట్ చేయాలి

- రాష్ట్రంలో అగ్రగామిగా నిలపాలి : మంత్రి పొన్నం ప్రభాకర్
- 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్ శిక్షణకు ఆదేశం
- 100 శాతం ఫలితాలు సాధించిన పాఠశాలలకు అభినందనలు
- తక్కువ ఫలితాలు వచ్చిన ప్రిన్సిపాల్స్ కు హెచ్చరిక
- విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు నేర్పాలని సూచన
- ప్రతి గురుకులంలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేస్తాం
- విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందించేలా ఉపాధ్యాయులు పని చేయాలని సూచన



**హైదరాబాద్, ప్రభాత గమనం :**

మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిచేలా అధ్యాపక బృందం సమిష్టిగా కృషి చేయాలని మంత్రి సూచించారు. గురువారం నిర్వహించిన మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలల పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను మంత్రి అభినందించారు. ఫలితాలు తక్కువగా వచ్చిన విద్యాసంస్థలు ఆత్మపరిశీలన చేసుకుని వచ్చే విద్యాసంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించాలని హెచ్చరించారు. విద్యార్థులకు చదువులతో పాటు ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్, ఏఐ తదితర అంశాల్లోనూ ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. 8వ తరగతి నుంచే నీట్, ఎంసెట్, ఇతర కాంపిటీటివ్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గురుకుల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, గురుకులాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరిచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచినట్లు వెల్లడించారు. తల్లిదండ్రులు ప్రభుత్వంపై నమ్మకంతో పిల్లలను గురుకులాలకు పంపుతున్నారని, ఉపాధ్యాయులు విద్యార్థులను తమ సొంత పిల్లల్లా చూసుకోవాలని కోరారు. గురుకులాల్లో విద్యతో పాటు క్రమశిక్షణ, సమాజంలో ఎలా మెలగాలి, పెద్దలతో ఎలా వ్యవహరించాలి వంటి విలువలను కూడా నేర్పించాలని మంత్రి సూచించారు. చిన్న చిన్న కారణాలతో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, విద్యార్థుల్లో మనోధైర్యం పెంపొందించేలా మోటివేషన్ ఇవ్వాలని అన్నారు. పదో తరగతిలో 98.45 శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. 204 గురుకులాలు వంద శాతం ఫలితాలు సాధించాయని, 500కు పైగా మార్కులు 9,788 మంది విద్యార్థులు సాధించారని తెలిపారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 90.31 శాతం, ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 97.72 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు వెల్లడించారు. ఇతర రాష్ట్రాల వారు కూడా తెలంగాణ గురుకుల విద్యావిధానాన్ని అధ్యయనం చేసే స్థాయికి ఎంజేపీ విద్యాసంస్థలను తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ర్యాంకర్ల ఫోటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి, ఫలితాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ సెక్రటరీ, మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల సెక్రటరీ, ఆర్సీవోలు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# గ్రామ స్థాయి నుంచే పర్యాటక స్పృహ పెంపొందాలి

- అడిషనల్ కలెక్టర్ రవి
- "మన ఊరు – మన పర్యాటకం" పేరిట ప్రత్యేక సదస్సు
- పర్యాటకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వెల్లడి
- జానపద కళలు, చేతివృత్తులకు ప్రోత్సాహం అవసరమని అభిప్రాయం
- పర్యాటకం సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేదిక కావాలని సూచన
- గ్రామీణ జీవనశైలి కూడా గొప్ప పర్యాటక ఆకర్షణేనన్న నిపుణులు

**హన్మకొండ, ప్రభాత గమనం :**

పర్యాటక అభివృద్ధి ద్వారా సమాజంలోని ఆర్థిక, సాంస్కృతిక రంగాలు బలోపేతం అవుతాయని, గ్రామ స్థాయి నుంచే పర్యాటక స్పృహ పెంపొందించాల్సిన అవసరం ఉందని హన్మకొండ అడిషనల్ కలెక్టర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం నక్కలగుట్ట హరిత కాకతీయ ప్రాంగణంలో "మన ఊరు – మన పర్యాటకం" పేరిట ప్రత్యేక సదస్సు నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్ రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశం చారిత్రక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ప్రకృతి సంపదలతో నిండిన గొప్ప పర్యాటక కేంద్రాలకు నిలయమని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలోని గ్రామీణ జీవనశైలి, సంప్రదాయాలు, దేవాలయాలు, చెరువులు, పండుగలు, జానపద కళలు, చేతివృత్తులు పర్యాటక రంగ అభివృద్ధికి విశేష అవకాశాలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లోని సహజ, సాంస్కృతిక వనరులను గుర్తించి అభివృద్ధి చేస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, మహిళా సంఘాలు, కళాకారులు, చేతివృత్తిదారులు ఆర్థికంగా బలోపేతం అవుతారని తెలిపారు. ప్రతి గ్రామం తన ప్రత్యేకతను ప్రపంచానికి చాటుతూ పర్యాటక మ్యాప్‌లో స్థానం సంపాదించుకోవాలని సూచించారు. అనంతరం కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మాట్లాడుతూ పర్యాటకం కేవలం వినోదానికి మాత్రమే పరిమితం కాకుండా సాంస్కృతిక పునరుజ్జీవనానికి వేదిక కావాలని అన్నారు. "మన గ్రామ జీవన విధానమే గొప్ప పర్యాటక ఆకర్షణ. రైతు జీవితం, పంట పొలాలు, పల్లె వాతావరణం, సంప్రదాయ ఆహారం, స్థానిక కళలు ఇవన్నీ పర్యాటకంలో భాగం కావాలి" అని ఆయన అభిప్రాయపడ్డారు.



# దివ్యాంగులకు త్వరితగతిన సదరం, యూడీఐడీ కార్డులు అందించాలి

- ప్రత్యేక క్యాంపులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హన్మకొండ, ప్రభాత గమనం:**

హనుమకొండ జిల్లాలో దివ్యాంగుల కోసం ప్రభుత్వ ఎంజీఎం ఆసుపత్రి, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిలో నిర్వహిస్తున్న ప్రత్యేక సదరం, యుడిఐడి (యూనిక్ డిసెబిలిటీ ఐడీ) క్యాంపులను జిల్లా కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్యాంపుల్లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు, అసెస్‌మెంట్ ప్రక్రియ, అప్లోడ్ విధానం, దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. దివ్యాంగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అక్కడికక్కడే సదరం సర్టిఫికెట్లు జారీ చేసే విధానాన్ని పర్యవేక్షించారు. దివ్యాంగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సదరం సర్టిఫికెట్లు, యుడిఐడి కార్డులను త్వరితగతిన అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. క్యాంపులకు వచ్చే దివ్యాంగుల కోసం త్రాగునీరు, కుర్చీలు, ప్రత్యేక కౌంటర్లు తదితర మౌలిక సదుపాయాలు సమృద్ధిగా కల్పించాలని సూచించారు. సదరం సర్టిఫికెట్ ప్రక్రియ పూర్తయిన అనంతరం యుడిఐడి కార్డులను లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా స్పీడ్ పోస్టు ద్వారా చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. దివ్యాంగులకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగవంతంగా అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీనివాస్, ఎంజీఎం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భరత్ కుమార్, ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్ర రెడ్డి, డీపీఎం (పెన్షన్స్) శ్రీనివాస స్వామి తదితరులు పాల్గొన్నారు.

# 'యూపీఎస్సీ' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- పరీక్షలకు హన్మకొండలో 10 కేంద్రాలు ఏర్పాటు
- 4,075 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ వెల్లడి
- ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించాలని ఆదేశం
- పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే గేట్లు మూసివేత
- ఆలస్యంగా వచ్చే అభ్యర్థులకు ప్రవేశం లేదని స్పష్టం
- మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్ లు నిషేధం
- తాగునీరు, వైద్య సదుపాయాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి
- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచన




**హన్మకొండ, ప్రభాత గమనం:**

ఈ నెల 24న నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో కలెక్టర్, న్యూఢిల్లీకి చెందిన ప్రైవేట్ సెక్రటరీతో కలిసి అధికారులతో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 4,075 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్షలు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం 10 మంది లోకల్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, 10 మంది సూపర్వైజర్లను నియమించినట్లు తెలిపారు. శుభం గార్గ్ సెంట్రల్ లెవెల్ ఇన్‌స్పెక్షన్ ఆఫీసర్‌గా, రాష్ట్ర స్థాయి అబ్జర్వర్‌గా వ్యవహరిస్తారని వెల్లడించారు. ఆదివారం ఉదయం 9:30 గంటల నుంచి 11:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 4:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష ప్రారంభానికి 30 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేస్తామని, అనంతరం ఒక్క నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు తీసుకురావద్దని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఫోటో ఐడీ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి రమేష్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జనగణనను సమర్థవంతంగా నిర్వహించాలి

- తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి
- సెన్సస్–2027 ఫేజ్-1ను సమర్థవంతంగా అధికారులకు నిర్వహించాలని ఆదేశం
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష
- హౌస్ లిస్టింగ్ బ్లాక్ ల వారీగా ఎన్యుమరేషన్ వేగవంతం
- ఎన్యుమరేటర్లు తప్పులు లేకుండా సమాచారం సేకరించాలని సూచన
- జనగణన ప్రక్రియపై అధికారులకు పవర్ పాయింట్
- జీడబ్ల్యూఎంసీ పరిధిలో పురోగతిపై వివరాలు అడిగిన డైరెక్టర్



**హన్మకొండ, ప్రభాత గమనం :**

2027 జనగణన ఫేజ్–1 ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలంగాణ జనగణన డైరెక్టర్ సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో సెన్సస్–2027 ఫేజ్–1 కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మున్సిపల్, ఇతర అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కొనసాగుతున్న సెన్సస్–2027 ఫేజ్–1 కార్యక్రమాల అమలు, ప్రగతి, ఫీల్డ్ స్థాయిలో చేపడుతున్న చర్యలపై జనగణన డైరెక్టర్ సమీక్షించారు. జనగణన కార్యక్రమాలను వేగవంతంగా, ఖచ్చితంగా పూర్తి చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర జనగణన డైరెక్టర్ జిల్లాలో, జీడబ్ల్యూఎంసీ పరిధిలో జరుగుతున్న జనగణన వివరాలను అడిగి తెలుసుకున్నారు. హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల వారీగా ఎన్యుమరేటర్ల ద్వారా ఎన్యుమరేషన్‌ను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. చార్జ్ అధికారులు క్షేత్రస్థాయిలో ఎన్యుమరేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో హౌస్ లిస్టింగ్ బ్లాక్‌ల వారీగా ఎన్యుమరేషన్ చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేటర్లు సమాచార సేకరణలో తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, హెచ్‌ఎల్‌బీల వారీగా ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చార్జ్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా స్టాటిస్టికల్ అధికారి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జనగణన ప్రక్రియపై అధికారులకు అవగాహన కల్పించారు. జనగణనకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాస్, ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఈవో గిరిరాజ్ గౌడ్, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ చంద్రశేఖర్, కాజీపేట, కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్లు బిర్రు శ్రీనివాస్, ప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ప్రభాత గమనం :**



జిల్లాలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల్లో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అంగన్వాడీ కేంద్రాల భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, వీవో భవనాల నిర్మాణ పురోగతిని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. చివరి దశలో ఉన్న నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. టెండర్లు పూర్తి కాని పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని భవన నిర్మాణ పనులు నిరంతర పురోగతిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల కాంపౌండ్ వాల్స్, టాయిలెట్స్, ఇతర నిర్మాణ పనులను జూన్ 30లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం లేకుండా సమయపాలనతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఈఈ, డీఈలు శ్రీనివాస్ రావు, జయశంకర్, శిరీష, శ్రీనివాస్ రెడ్డి, వివిధ మండలాల పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374